క్లుప్తంగా

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దండ: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ శరత్‌కుమార్ జన్మదినం సందర్భంగా మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూపతిరెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలను అందించడానికి వైద్యులు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యశోదహాస్పిటల్ వైద్యులతో గుండెకు సంబంధించిన ఈసీజీ టుడీకో, షుగర్, చిన్నపిల్లలకు ఉచితంగా పరీక్షించి మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు వీరమల్ల శరత్, రంజిత్, నాగరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు తీసుకోవడంపై హర్షం



అమ్రాబాద్: ఏటీడీఓగా పనిచేస్తున్న కమలాకర్‌రెడ్డి జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు తీసుకోవడంపై పదర మండల గిరిజన బాలికల వసతిగృహం హెచ్‌డబ్ల్యూఓ తిరుపతమ్మ, పీడీ బీమ్లా తదితరులు మంగళవారం జిల్లా కేంద్రంలో డీటీడీఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కమలాకర్‌రెడ్డి డీటీడీఓగా అదనపు బాధ్యతలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్య నాయకులు



వెల్దండ: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాలతో సన్మానించారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి అన్నసత్రం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్యామ్‌సుందర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, శ్రీరాములు, సురేష్ తదితరులు ఉన్నారు.

సిబ్బందికి సన్మానం



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో 15 రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలు అందించిన గ్రామపంచాయతీ కార్మికులను, బోయలను, రథసారథులను, బాజాభజంత్రి వారిని మంగళవారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బల్లారీ నాగేశ్వర్ ఘనంగా సన్మానించారు. బ్రహ్మోత్సవాలు సజావుగా జరిగేందుకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పనిచేశారని వారిని కొనియాడారు. వీరితో పాటు ఆలయ అర్చకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రామాచారీ, సుదర్శనాచారీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ అధికారి నిర్లక్ష్యం వీడాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఏడాది కిందట లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేటికీ కార్డులు ఇవ్వకుండా లేబర్ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ కార్యాలయాన్ని ముట్టడించి వినతి అందజేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, అశోక్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, గట్టు శ్రీను, లక్ష్మీనారాయణ, మణ్యం, బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కూలీలందరికీ పని కల్పించాలి



దేవల్‌తిరుమలాపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లోని కూలీలందరికీ ఉపాధి పని కల్పించాలని జెడ్పీసీఈఓ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం దేవల్‌తిరుమలాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో ఆమె మాట్లాడారు. పనికోసం వచ్చే కూలీలకు జాబ్‌కార్డులను అందజేసి పని కల్పించే బాధ్యత ఎంపీడీఓలపై ఉందని అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పనుల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గతంలో నాటిన మొక్కలకు నీరు పోసి ఎండిపోకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ కృష్ణయ్య, ఈసీ రామ్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, దేవేందర్ ఉన్నారు.

ఉపాధి కూలీలపై అన్ని జాగ్రత్తలు

మన్ననూర్: ఎండలు మండిపోతున్నందున ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీల ఆరోగ్యంపై అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామ్మోహన్ నిర్వాహకులకు సూచించారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి, దోమలపెంట గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో టెంటు, మెడికల్ కిట్, ఓఆర్‌ఎస్ పాకెట్లు, తాగునీరు తప్పకుండా అందుబాటులో ఉంచాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటయ్య, ఆంజనేయులు, రేణయ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ అందజేత

తాడూరు: ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లను పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఆశావర్కర్లు మంగళవారం పని ప్రదేశం వద్ద అందజేశారు. మండలంలోని గుంతకోడూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఎంపీడీఓ గంగామోహన్ ఆదేశాల మేరకు అందజేస్తున్నామని చెప్పారు.



వటువర్లపల్లిలో ఉపాధి పనుల్లో రాతి కట్టడాలను పరిశీలిస్తున్న అధికారులు



తాడూరులో కూలీలకు ఓఆర్‌ఎస్ అందజేస్తున్న కార్యదర్శి, ఆశావర్కర్లు

ఉపాధిహామీ పనుల పరిశీలన

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో మంగళవారం ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఫీడర్ చానల్ పనులను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. పనులు నిబంధనల ప్రకారం చేయాలని సూచించారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో కల్వకుర్తి– నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై తర్నికల్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో గ్రామస్తులతో పాటు ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గణేష్, ఉస్సేన్, సాయి, వెంకటేశ్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

తాడూరు: గ్రామస్థాయిలో ఇంటింటి ప్రచారం చేయడంతో పాటు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ఐక్యమత్యంతో పనిచేయాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండనాగేష్ అన్నారు. మంగళవారం స్వశక్తికరణ్ అభియాన్ బూతు కమిటీల ఎంపిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆకునెల్లికుదురు, పాపగల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ నాయకులు రోహిత్‌రెడ్డి, తిరుపతయ్య, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తాడూరు: మండలంలోని తుమ్మలసూర్‌కు చెందిన బంగారమ్మ అకస్మాతుగా మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే తరఫున బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యార రమేష్ గ్రామానికి వెళ్లి ఆ కుటుంబానికి అందజేశారు. గ్రామానికి చెందిన రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి సొంతంగా రూ.5 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మశన్న, చింతసత్తి, బంగారయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన ఉస్సేన్ ఇటీవల మృత్యువాత పడ్డాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. రాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని కూలదోయాలి



పెద్దపల్లిలో మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

తెలకపల్లి: ప్రజావ్యతిరేఖ విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని కూలదోయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సీపీఐ జాతీయ పిలుపులో భాగంగా బీజేపీ హఠావో, దేశ్‌కో బచావో అనే నినాదంతో చేపట్టిన ఇంటింటికీ సీపీఐ చైతన్య యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలేరులో ప్రారంభమైన యాత్ర బొప్పల్లి, వట్టిపల్లి, పెద్దూరు, పెద్దపల్లి, గౌతంపల్లి, గడ్డంపల్లి, అనంతసాగర్, గట్టురాయిపాకుల, బండపల్లి, చిన్నముద్దునూరు, కార్వంగ, తాళ్లపల్లి, నడిగడ్డ గ్రామాల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా ప్రజా సంఘాల నాయకులు కేశవులు గౌడ్, రవీందర్, సూర్యశంకర్‌గౌడ్, బాలమురళీ, వార్ల వెంకటయ్య, మధు గౌడ్, ఆంజనేయులు, బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు ప్రారంభం



పెద్దకొత్తపల్లి: మండలంలో కేఎల్‌ఐ నీరు రావడంతో రైతులు పెద్దఎత్తున యాసంగిలో వరిసాగు చేపట్టారు. చెరువు, కుంటలు, బోర్లు, బావుల కింద రైతులు వరిసాగును అధికంగా చేపట్టారు. మండలంలో 9,860 ఎకరాల్లో వేరుశనగ, 7,308 ఎకరాల్లో మినుములు, 2,074 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి సాగు చేసిన రైతులు హార్వెస్టర్లతో వరి కోతలను ప్రారంభించారు. మండలంలోని దేవల్‌తిరుమలాపూర్, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, దేవినేనిపల్లి, వెనచర్ల, నక్కలపల్లి, గంట్రావుపల్లి, నారాయణపల్లి, మహాసముద్రం, సాతాపూర్ గ్రామాల్లో వరిసాగును అధికంగా చేపట్టారు. వ్యవసాయ అధికారులు వరిధాన్యం కొనగోలు కేంద్రాలను ప్రారంభించి వడ్లను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ సోషల్‌మీడియా జిల్లా ఇన్‌చార్జ్‌గా హనుమంతునాయక్

అమ్రాబాద్: కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా జిల్లా ఇన్‌చార్జ్‌గా పదర మండలం చెన్నంపల్లికి చెందిన హనుమంతునాయక్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. బాధ్యతలు అప్పగించడంపై డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉమామహేశ్వరంలో జడ్జిల పూజలు



పూజల అనంతరం సన్మానం పొందిన జడ్జిలు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా జడ్జి రాజేష్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జి సబిత, అచ్చంపేట సివిల్ జడ్జి విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఆలయ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ఆర్థికసాయం అందజేత

శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు కొడిమెళ్ల వేణుగోపాల్, కిరణ్మయి దంపతులు ఆలయంలో పూజలు చేసి నిత్యాన్నదానానికి రూ. 25,116లు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి



కల్వకుర్తిలో సమ్మె చేస్తున్న వీఓఏలు



తెలకపల్లిలో మాట్లాడుతున్న చంద్రకళ

పెంట్లవెల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఐకేపీ సమస్యలను వెంటనే నెరవేర్చాలని ఐకేపీ వీఓఏల రాష్ట్ర అధ్యక్షుడు రాజుకుమార్ అన్నారు. పెంట్లవెల్లిలో రెండో రోజు ఐకేపీ వీఓఏల సమ్మె కొనసాగింది. బాలకృష్ణ, మధు, ప్రకాష్, వెంకటేష్, వెంకటస్వామి, మురళి, వసంత పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య వద్ద ఐకేపీ వీఓఏల వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేపట్టారు. వీఓఏల జిల్లా అధ్యక్షుడు సాయిప్రకాష్, వెంకటయ్య, నగన్‌మోహన్, ప్రవీన్, కాశన్న పాల్గొన్నారు.

తెలకపల్లి: రెండో రోజు మంగళవారం మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మెకు సీఐటీయూ అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు బి చంద్రకళ మద్దతు ఇచ్చారు. లక్ష్మణ్, నాగలక్ష్మి, సుధా, బాబు పాల్గొన్నారు.

సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

కోడేరు: మండలంలో పనిచేస్తున్న వీఓఏలను తెలంగాణ ప్రభుత్వం సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వీఓఏలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. జ్యోతి, మదన్‌మోహన్, చంద్రయ్య, కురుమయ్య, రాజునాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

చారకొండ: కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వీఓఏల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ హాజరై వారికి సంఘీభావం తెలియజేశారు. విజయ్ కూమార్ రెడ్డి, వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

వీఓఏలకు కనీసవేతనం అందించాలి

వెల్దండ: గ్రామాల్లో మహిళ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న వీఓఏలకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వీఓఏల నిరవధిక సమ్మెకు సీఐటీయూ సంఘీభావం తెలిపారు. గిరిజన సంఘం నాయకులు శంకర్‌నాయక్, మహిపాల్, జంగమ్మ, జాహెద, అల్లాజీ, నందు, శ్రీనునాయక్ ఉన్నారు.



పెంట్లవెల్లిలో సమ్మెలో పాల్గొన్న మండల వీఓఏలు

ప్రభుత్వ విఫలం

లింగాల: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేపట్టిన ఆందోళన మంగళవారం రెండో రోజు కొనసాగింది. మండల యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి, చంద్రశేఖర్, శ్రీను, వెంకటయ్య, రాము, దేవేందర్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల కేంద్రంలో వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సందర్శించి మాట్లాడారు. వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమతి, రామస్వామి, సుగుణ, కృష్ణవేణి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: ఐకేపీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీఓఏల వేతనాలు పెంచి సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. వీఓఏలు లక్ష్మీ, స్వప్న, వెంకటస్వామి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

కల్వకుర్తి రూరల్: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని ఇందిరక్రాంతి పథం వీఓఏలు అన్నారు. మంగళవారం రెండో రోజుకు సమ్మె చేరుకోవడంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. దేవయ్య, రాణి, మమత, స్వప్న పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రదర్శన



సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే నివారణపై మహిళలకు అవగాన కల్పిస్తున్న సిబ్బంది

దోమలపెంట(అచ్చంపేట): జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలనే అంశంపై ఈగలపెంటలో భూగర్భ కేంద్రం ఫైర్ సేఫ్టీ అధికారులు ప్రదర్శన నిర్వహించారు. ప్రధానంగా సీఈ పరిపాలన కార్యాలయం శక్తిసదన్, డీఏవీ ఆంగ్ల పాఠశాల విద్యార్థులకు జెన్‌కో ఉద్యోగుల నివాస కాలనీలో గ్రుహిణిలకు ప్రమాదాలపై అవగాహన, ప్రదర్శన నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఏడీఈ రాము, ఎస్‌ఎఫ్‌ఓ మల్లికార్జున, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సమావేశం



సమావేశంలో బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

తాడూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన బీఎల్‌ఓల సమావేశాన్ని మంగళవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 1,339 మంది ఓటర్లకు జనవరి 1, 1900 అనే వయసు నమోదై ఉందని, ఆ జాబితా ఆధారంగా బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి నిజమైన పుట్టిన తేదీని గుర్తించాలన్నారు. ప్రతి గ్రామానికి సంబంధించిన జాబితాను వెంటపెట్టుకుని ఆ తేదీని సరిచేసే క్రమంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల్లో ఆయా బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఫాం నంబర్ 8లో మార్పులు చేర్పులను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్‌అలీ, ఆర్‌ఐ గోపాలకృష్ణ, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కృషి



మైనార్టీలకు తోఫా అందజేస్తున్న ఎంపీపీ రాధ జంగయ్య తదితరులు



కొట్రలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

ఊర్కొండ: మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ రాధజంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మైనార్టీలకు రంజాన్ తోఫా అందజేశారు. కలీం పాషా, కొమ్ము రాజయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో గ్రామసేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకలు అన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రవీందర్‌రావు, ముస్లింలు సద్దామ్, నజీర్, రావుఫ్ తదితరులు ఉన్నారు.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో....

మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లయ్య, రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇంటింట మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

వెల్దండ: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటింట మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రోత్సహించాలని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా శిక్షకులు ఉపన్న పేర్కొన్నారు. మంగళవారం వెల్దండలోని రైతువేదికలో ఎంపీపీ విజయ అధ్యక్షతన సర్పంచులకు, కార్యదర్శులకు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ పాటించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పూర్తి సర్వే చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలకుగా ఎంపిక చేసి అవార్డులను అందిస్తామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, దేవేందర్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామ మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి భార్య ప్రమిళమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ సిర్సనగండ్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బాల్‌రాం గౌడ్, వెంకట్ గౌడ్, విజయ్‌కూమార్ రెడ్డి ఉన్నారు. సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ నివాళి అర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబానికి..

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లలో మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందిన మేడ సాని జనార్దన్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సందర్శించి నివాళి అర్పించారు. కట్టా అనంతరెడ్డి, రంగారెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రీడింగ్ రూములు ఏర్పాటు చేయాలి

ఊర్కొండ: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో యువతకు, విద్యార్థులకు ఉపయోగపడేలా రీడింగ్ రూములు ఏర్పాటు చేయాలని ఎంపీపీ రాధజంగయ్య కోరారు. స్థానిక రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యువతకు మరియు విద్యార్థులకు ఉపయోగపడేలా అన్ని గ్రామపంచాయతీలో రీడింగ్ రూములు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. అనంతరం మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలను సభకు తెలియజేశారు. గౌరవ ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరమ్మముత్యాలు, ఎంపీటీసీ సభ్యులు పోలే బంగారమ్మ శంకర్, ఖలీమ్ పాష, కొమ్ము రాజయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలను పసిగట్టాలి



బిజినేపల్లి: ఆన్‌లైన్‌లో తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, బ్యాంకు ఖాతాల వెరిఫికేషన్ అంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌కి, మెసెజ్‌లకు ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు చెప్పండి అంటూ వచ్చే కాల్స్‌కు స్పందించరాదని ఏఎస్‌ఐ శంకరయ్య అన్నారు. మంగళవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలిసింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే కొన్ని కంపెనీల ప్రకటనలతో నమ్మి మోసపోవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బాలస్వామి, శారద, పద్మ పాల్గొన్నారు.

అందుబాటులోలేని పంచాయతీ కార్యదర్శులు

కోడేరు: మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీలో అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు స్పందించి సమయపాలన ప్రకారంగా విధులకు హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని సూచించారు.